ప్రపంచంతోనే పోటీ...

- పదేళ్లలో రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- ఫ్యూచర్ సిటీదే భవిష్యత్
- కాగ్నిజెంట్ క్యాంపస్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

పారిశ్రామికాభివృద్ధిలో ప్రపంచంతోనే తాము పోటీ పడుతున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే పదేండ్లలో తెలంగాణ రూ.లక్షకోట్ల ఆర్థికాభివృద్ధి సాధించాలనేదే తమ లక్ష్యమని చెప్పారు. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన ఆయన బుధవారంనాడిక్కడి కోకాపేటలో కాగ్నిజెంట్ సంస్థ నూతన క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రపంచ అవసరాలు తీర్చేలా అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో భవిష్యత్ నగరాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు 430 సంవత్సరాల చరిత్ర ఉందనీ, ఈ నగర వ్యవస్థాపకుడు కులీకుతుబ్ షా నుంచి తన వరకు ఎవరు పాలించినా, వ్యవస్థలు మారినా, విధానాలతో సంబంధం లేకుండా అందరూ దీని అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారగానే ఇక్కడి నుంచి పెట్టుబడులు అక్కడి తరలిపోతాయనే చర్చను కొందరు ప్రారంభించారని, కానీ తన పోటీ పొరుగురాష్ట్రాలతో కాదనీ, ప్రపంచంతోనే అని స్పష్టం చేశారు. 1992లో ఐటి పరిశ్రమలకు నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తే, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌రెడ్డి దాని అభివృద్ధిని కొనసాగిస్తూ, సైబరాబాద్ నిర్మించారని తెలిపారు. తాము నూతనంగా నిర్మించబోయే భవిష్యత్ సిటీలో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ జరుగుతుందని స్పష్టం చేశారు. పదిరోజుల తన విదేశీ పర్యటనలో రూ.31,500 కోట్ల పెట్టుబడులు పెట్టి, 30,750 మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించేలా ఒప్పందాలు జరిగాయన్నారు. త్వరలోనే మరిన్ని ఒప్పందాలు జరుగుతాయని, పెట్టుబడులకు సంబంధించి సమావేశాల నిర్వహణ కోసం ఇన్వెస్టర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. కాగ్నిజెంట్ సంస్థ విస్తరణకు ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్ గుర్తింపు పొందిందని, 2002లో హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సంస్థ లక్ష మందికిపైగా ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. తాము నిర్మించే భవిష్యత్ (ఫ్యూచర్) సిటీలోనూ కాగ్నిజెంట్ ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రం, దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే పారిశ్రామిక విధానం పారదర్శకంగా ఉండాలని, పెట్టుబడిదారులను ప్రోత్సహించే విధానం ఉండాలని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. అందుకే ప్రభుత్వం మారినా విధానాల్లో మార్పు చేయలేదని, ఇంకా వేగంగా, పారదర్శకంగా, పట్టుదలతో తాము పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఒక్క రోజులో అభివృద్ధి చెందలేదని, అంచలంచలుగా ఎదుగుతూ వచ్చిందని చెప్పారు. దావోస్ పర్యటనలో తాము కాగ్నిజెంట్ సిఇఒ రవికుమార్, కాగ్నిజెంట్ అమెరికన్ ప్రెసిడెంట్, ఇవిపి సూర్య గుమ్మడితో క్యాంపస్ విస్తరణపై చర్చించామన్నారు. కేవలం ఆరునెలల్లోనే వారు స్పందించి ఇక్కడ క్యాంపస్ విస్తరణ పూర్తి చేసి, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ), సైబర్ సెక్యూరిటీ, క్వాంటమ్ వంటి విభిన్న రకాల ప్రతిభను అన్వేషిస్తోందని, దానికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధికి వసతులు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాగ్నిజెంట్ ఇవిపి, కాగ్నిజెంట్ అమెరికస్ ప్రెసిడెంట్ సూర్య గుమ్మడి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కాగ్నిజెంట్‌కు 3.46 లక్షల మంది ఉద్యోగులు ఉంటే, దానిలో భారతదేశంలో 2.40 లక్షల మంది, వారిలో 57 వేల మంది హైదరాబాద్‌లోనే ఉన్నారని వివరించారు. దానిలోనూ 39 శాతం మంది మహిళలే ఉన్నారని చెప్పారు. హైదరాబాద్‌తో తమది వ్యూహాత్మకమైన పెట్టుబడని, స్థానికంగా ప్రతిభావంతులైన యువతకు ఉపాధి కల్పిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఎఐ, ఎంఎల్, డేటా ఇంజినీరింగ్, ఐఒటిలో కట్టింగ్ ఎడ్జ్ సమస్యలకు ఈ కేంద్రం పరిష్కారం చూపిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మంజీరా అభయారణ్యానికి 'రాంసర్' గుర్తింపునకు ప్రతిపాదనలు

- దీవుల్లో ఎన్నో రకాల జీవ వైరుధ్యాల జీవులు
- అభయారణ్యాన్ని సందర్శించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా మంజీరా బ్యారేజీ సమీపంలో ఉన్న మంజీరా అభయారణ్యానికి 'రాంసర్' గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్టు స్టేట్ వెట్లాండ్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రశాంతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'సౌభాగ్యత మిషన్' కార్యక్రమంలో భాగంగా మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. అందులో భాగంగా ఐఎఎస్ అధికారుల కేంద్ర బృందం సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రశాంతి ఆధ్వర్యంలో బుధవారం మంజీరా అభయారణ్యాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ.. బయోడైవర్సిటీ కార్యక్రమాల్లో భాగంగా మంజీరా అభయారణ్యాన్ని రాంసర్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. మంజీరా నుంచి సింగూరు బ్యారేజీ వరకు మంజీరా నదిలో 20 చదరపు కిలో మీటర్ల విస్తీరణముందన్నారు. మంజీరా నదిలో తొమ్మిది దీవులున్నాయని, వీటిల్లో ఎన్నో రకాల జీవ వైరుద్యాల జీవులు నివశిస్తున్నాయని తెలిపారు. 300 రకాల పక్షులు, 160 రకాల ఇతర జీవులు ఈ దీవుల్లో ఉన్నాయని అధికారులు గుర్తించినట్టు చెప్పారు. ఎన్నో అరుదైన జాతుల పక్షులు సైతం మంజీరా అభయారణ్యం వైల్డ్ లైఫ్ శాంక్చురిలో ఉన్నట్టు తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ప్రతేడాది వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలంలో ఆయా సీజన్లకు అనుగుణంగా వివిధ రకాల వలస పక్షులు మంజీరా నది మధ్యలో ఉన్న ఈ తొమ్మిది దీవులకు వలస వస్తున్నట్టు తెలిపారు. రాంసర్ గుర్తింపు వల్ల మంజీరా అభయారణ్యానికి ప్రపంచ స్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా బోటుపై ఐఎఎస్ అధికారుల బృందం మంజీరా అభయారణ్యంలోని తొమ్మిది దీవుల సముదాయంలో విస్తరించి ఉన్న వైల్డ్ లైఫ్ శాంక్చురిని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను సభ్యులు తిలకించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు కీర్తి మాన వస్తీ, కల్వేరసన్, డాక్టర్ జాన్సె మాత్యు, వికాస్ చంద్రగుప్త, శ్రీకాంత్, డాక్టర్ మనోజ్, చంద్రం సింగ్, రాంబాబు, సంబంధిత బృంద సభ్యులు, సంగారెడ్డి జిల్లా ఫారెస్ట్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి

సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విషజ్వరాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులు వర్షాలు కురుస్తున్నాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని జిల్లాల్లో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయని వివరించారు.

నేడు సీతారామ ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనకు సర్కారు ముమ్మర ఏర్పాట్లు చేసిందిజ దశాబ్దాల సాగు నీటి కల సాకారం చేసే సీతారామ ప్రాజెక్ట్‌ను గురువారం (ఆగస్టు 15) ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేయనున్నారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా ముల్కలపల్లి మండలం పూసుగూడెం వద్ద పైలాన్ ఆవిష్కరించనున్నారు. పంప్‌హౌస్ మోటార్లు స్విచ్చాన్ చేసి డెలివరి సిస్టర్న్ వద్ద గోదావరీ నదికి సిఎం పూజలు చేయనున్నారు. స్వాతంత్ర్యదినోత్స వాన హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో సిఎం జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం హెలికాప్టర్ ద్వారా నేరుగా భద్రాద్రికి జిల్లాకు వస్తారు. స్థానిక రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌లను ప్రారంభించిన అనంతరం అక్కడే భోజనాలు చేసుకుని వైరాలో జరుగనున్న భారీ బహిరంగ సభలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించనున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో కొరవడిన భద్రత

- బయటి వ్యక్తుల చేతుల్లోకి సెక్యూరిటీ
- నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఏకపక్ష నిర్ణయాలు
- వైద్యసిబ్బందిపై తరచూ దాడులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో భద్రతకు సంబంధించి వైద్య సంఘాలు, నిపుణులు చేస్తున్న సూచనలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దేశవ్యాప్తంగా దాడులు పునరావతమవుతున్నాయి. ప్రతీ రోజు ఏదో ఒక చోట దాడి, లైంగిక దాడి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని వైద్య సంఘాలు దశాబ్దాలుగా చేస్తున్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో అవగాహన కలిగిన వైద్య సంఘాల అభిప్రాయాలను, సూచనలను మోడీ సర్కార్ స్వీకరించడం లేదు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి ఘటన వంటివి వెలుగు చూసిన సందర్భాల్లో హడావుడిగా కొన్ని సూచనలు చేసి సర్కారు చేతులు దులుపుకుంటున్నది. దీంతో వైద్యులు, ముఖ్యంగా మహిళా వైద్య సిబ్బంది భద్రత నిత్యం ఒక ప్రశ్నలాగే మిగిలిపోతున్నది.

ప్రభుత్వాస్పత్రులు, వైద్య కళాశాలల్లో తగినన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని డాక్టర్ల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. వైద్య కళాశాలల్లో థియరీ నేర్చుకుని ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో భాగంగా ఆయా బోధనాస్పత్రుల్లో విధులు నిర్వహించే మహిళా సిబ్బందికి రవాణా పెద్ద సమస్యగా మారుతున్నది. నైట్ షిఫ్టుల్లో విధులు నిర్వహించి ఆస్పత్రి నుంచి కళాశాలకు వెళ్లే క్రమంలో భయపడుతూ వెళ్లాల్సి వస్తున్నదని పలువురు మహిళా వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం రవాణా సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో వారు సొంత వాహనాలపై ఒంటరిగానే వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి సమయాల్లో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య సిబ్బందికే కాకుండా పలు సందర్భాల్లో రోగుల సహాయకులకు భద్రత లేకపోవడం ఇబ్బందిగా మారుతుంది. వారు వేధింపులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాస్పత్రులు, మెడికల్ కాలేజీల్లో సెక్యూరిటీని పొరుగు సేవలకు అప్పగించడం కూడా ఇలాంటి ఘటనలు జరగడానికి ప్రధాన కారణంగా ఉంటోంది. ప్రభుత్వ యాజమాన్యంలోనే సెక్యూరిటీ వ్యవస్థ ఉండాల్సిన అవసరముందని నిపుణులు సైతం సూచిస్తున్నారు.

సెక్యూరిటీని పొరుగుసేవలకు అప్పగించడంతో ఆయా ఏజెన్సీలు, కాంట్రాక్టర్లే సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకుంటున్నారు. ఈ నియామకాల్లో ఆయా కాంట్రాక్టర్లు, ఏజెన్సీలకు నచ్చితే చాలు. ఆస్పత్రికి, మెడికల్ కాలేజీకి సెక్యూరిటీ కల్పించగలిగిన అర్హతలు ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆస్పత్రులకు, మెడికల్ కాలేజీలకు వచ్చి, పోయే వ్యక్తులపై తగినంత నిఘా కూడా ఉండటం లేదనీ, అది లేకపోవడంతోనే దుర్ఘటనలు జరగడానికి కారణమవుతున్నాయని వైద్యులు వాపోతున్నారు. రాష్ట్రంలోనూ గతంలో గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ తదితర ఆస్పత్రుల్లో వైద్యులపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే.

విధాన నిర్ణయాల్లో అందరిని భాగస్వాములు చేయాలి



ప్రభుత్వాస్పత్రుల్లో పటిష్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన మార్గదర్శకా లను జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం సెక్రెటరీ జనరల్ డాక్టర్ కిరణ్ మాదాల డిమాండ్ చేశారు. దాడుల నివారణకు పటిష్టమైన చట్టం, మౌలిక సౌకర్యాల కల్పనకు యుద్ధ ప్రాతిపదినక చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్ఎంసీ విధాన నిర్ణయాలు తీసుకునే ముందు వైద్యవ్యవస్థలో భాగస్వాములందరి సలహాలు, సూచనలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఉన్న కొంత మంది వైద్యులతో వేసిన కమిటీ నిర్ణయాలు గల్లీల్లోని వైద్యవ్యవస్థకు పనికి రావడం లేదని విమర్శించారు. సమస్య వచ్చినప్పుడు దిద్దుబాటు చర్యలే తప్ప, మళ్లీ సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

-డాక్టర్ కిరణ్ మాదాల

హరీశ్‌రావుపై పొన్నం వ్యాఖ్యలు సరికావు

- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి హరీశ్‌రావుపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హరీష్‌రావు పని విధానాన్ని తప్పు పట్టే నైతిక అర్హతా పొన్నంకు లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని విమర్శించారు. రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేస్తున్నామని ఆర్బాటాలు పలికీ, కేవలం రూ.18 వేల కోట్లతో మమా అనిపించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఇప్పటికే 75 వేల మంది తమకు రుణమాఫీ రాలేదని ఫిర్యాదులు చేశారని అన్నారు. మూడో విడతలో అర్హులందరికి రుణ మాఫీ చేయకుంటే సిఎంతో పాటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ సర్కార్‌లోని మంత్రులు ఎమ్మెల్యేలు బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒక్క రవాణా శాఖలోనే ప్రతి జిల్లాకు రూ. కోటి అక్రమంగా వసూలు చేస్తున్నారని అన్నారు. పౌర సరఫరాల శాఖ నుంచి బిల్డర్ల వరకు ఎవరిని వదలడం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావులపై బురద జల్లడం తప్ప పొన్నం చేస్తున్నదేమి లేదని పేర్కొన్నారు. ఆర్‌టిసిని మిగులు బడ్జెట్ తో అప్పగిస్తే రూ 2,100 కోట్ల నష్టానికి చేర్చారని అన్నారు. పొన్నం ప్రభాకర్ ముందు తన శాఖపై దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు.

IN THE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE :: TIRUPATI
IA.No. 4 of 2022
IA.No. 194 of 2021
A.S.No. 11 of 2015

Between:
V.Balakrishna Reddy (Died) & others ...Appellants
And
Chinnabbagari Muni Reddy & 4 others ...Respondents

NOTICE TO RESPONDENT No. 2

To,
Res.No.2 : Sujatha, W/o Prasad Reddy, 48 years, Residing at S.R.T.No.127, Sanath Nagar, Hyderabad City-500018, Telangana State.

The above petition stands posted for your appearance on 30-08-2024 at 10:30 A.M either in person or through counsel else the matter will be decided exparte.

D.L.R.BALAKRISHNA SATYAM, LLM
Ch.V.B.MURALI KRISHNA, LLB
Advocates, 13-5-558, Tata Nagar, Near Veterinary Hospital, Tirupati,
Cell: 9290705268

చదువు యాదయ్యకు రాష్ట్రపతి గ్యాలంటరీ మెడల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలను బుధవారం ప్రకటించింది. దేశవ్యాప్తంగా మొత్తం 1037 మందికి ఈ పతకాలను అందజేయనున్నారు. కాగా, ఈసారి అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పోలీసు పతకానికి తెలంగాణకు చెందిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య ఎంపికయ్యారు. తెలంగాణ పోలీసు శాఖలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్య 2022లో ఓ చోరీ కేసులో ధైర్యంగా వ్యవహరించారు. గొలుసు దొంగతనాలు, ఆయుధాల డీలింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు దుండగులు ఇషాన్ నిరంజన్ నీలంనల్లి, రాహుల్‌ను సాహసోపేతంగా పట్టుకున్నారు. 2022 జులై 25న చోరీకి పాల్పడుతుండగా యాదయ్య వీరిని అడ్డుకున్నారు. దీంతో దుండగులు ఆయనపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశారు. ఛాతీపై పలుమార్లు పొడిచారు. తీవ్ర రక్తస్రావంలోనూ ఆయన వారిని పట్టుకున్నారు. గాయాల కారణంగా 17 రోజుల పాటు ఆయన ఆసుపత్రి పాలయ్యారు. దుండగులను పట్టుకునే క్రమంలో ఆయన చూపిన ధైర్యసాహసాలకు గానూ ఈ ఏడాది అత్యున్నత రాష్ట్రపతి గ్యాలంటరీ పతకాన్ని ప్రకటించారు. ఈ ఏడాది మొత్తం 1037 మందికి ఈ పతకాలు ప్రకటించారు. ఇందులో 213 మందికి పోలీస్ మెడల్స్ ఫర్ గ్యాలంటరీ, 94 మందికి రాష్ట్రపతి విశిష్ఠ సేవా పతకాలు, 729 మందికి పోలీసు విశిష్ఠ సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలను అందజేయనున్నారు. తెలంగాణ నుంచి 21 మంది ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు.

మహిళలపై దాడుల నిరోధానికి కఠిన చట్టాలు

- పాఠశాల స్థాయిలోనే నైతిక విలువలు నేర్పాలి
- గాంధీలో డాక్టర్ల నిరసనకు మంత్రి సీతక్క సంఘీభావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల భద్రతకు మరింత కఠినమైన చట్టాలను రూపొందించి అమలు చేస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. అదే సమయంలో దాడుల నిరోధానికి దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరమని అభిప్రాయపడ్డారు. తరగతి గదుల నుంచే పిల్లలకు నైతిక విలువలను, మహిళల పట్ల గౌరవాన్ని పెంపొందించాలని సూచించారు. అందుకోసం తమ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా పాఠ్యాంశాల్లో అవసరమైన మార్పులు తీసుకురావాల్సిన అవసరముందని సూచించారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగిక దాడి ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు చేపట్టిన నిరసనకు ఆమె సంఘీభావం ప్రకటించారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోల్‌కతా ఘటన తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. దేవతతో సమానమైన మహిళలు ఇప్పుడిప్పుడే బయటికి వస్తున్నారని చెప్పారు. వైద్యురాలిపై లైంగికదాడి హేయమైన ఘటన అంటూ అలాంటివి మహిళలను మళ్లీ మధ్య యుగాలకు తీసుకెళ్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులకు తాము అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. తప్పు చేసిన వారు ఎవరైనా సరే.. ఉపేక్షించకూడదని చెప్పారు. మహిళల భద్రత గురించి సమాజంలో ప్రతి ఒక్కరి ఆలోచన మారాలనీ, ఆ దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణకు కట్టుబడి పని చేస్తున్నట్టే మహిళల భద్రత కోసం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. పని ప్రదేశాల్లో మహిళల భద్రత కోసం కృషి చేయాలని కోరారు. మహిళలపై దాడులు చేస్తే కఠినాతి కఠినమైన శిక్షలు పడతాయన్న భయం, భక్తి ఉండాలని, అలా ఉన్నప్పుడే అఘాయిత్యాయలు నివారించబడతాయని ఆమె అభిప్రాయపడ్డారు.



జిఎన్ఐటిఎస్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

ప్రజాశక్తి - హైదరాబాద్

జి. నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్‌లో బుధవారం పాఠశాల విద్యార్థుల కోసం ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది. దీనిని ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసింది. విద్యార్థులలో సృజనాత్మక ఆలోచన, సమస్య, పరిష్కారం, కొత్త ఆలోచనల అనువర్తనాన్ని ప్రోత్సహించే పర్యావరణం, మనస్తత్వాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని సాలిటైర్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన 250 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిఎన్ఐటిఎస్ ఎఐసి సిఇఒ డాక్టర్ శాశ్వత్ పాఠక్ విద్యార్థులకు సృజనాత్మకత, ఆవిష్కరణలపై మార్గనిర్దేశం చేశారు.

అప్పులు సరే.. తీర్చే మార్గమేది?

- ఆర్‌డిసికి బ్యాంకర్ల సూటి ప్రశ్న
- సొంత ఆదాయ మార్గాలను అన్వేషించాలంటూ ఆర్‌బిఐ మెలిక..
- అధికారుల కసరత్తు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంగానీ, రాష్ట్రంగానీ అభివృద్ధి చెందాలంటే మౌలికసదుపాయాలు కీలకం. ప్రధానంగా రోడ్లు అత్యంత ప్రధానం. రోడ్లను బాగుచేయాలంటే నిధులు కావాలి. అరకొర పనులు జరుగుతున్నా, అవి సరిపోవు. భారీఎత్తున పాత రోడ్లకు మరమ్మతులు చేయడం, కొత్త వాటిని నిర్మించడం చేయాల్సిందే. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాణ్యమైన రోడ్లను వేయడం ద్వారా అత్యుత్తమ రవాణా సదుపాయాలు కల్పించాలంటే భారీ పెట్టుబడులు అవసరం. ఈ నేపథ్యంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఆర్‌డిసి) చురుగ్గా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తుంది. అయితే ఇందుకు నిధులు ప్రధాన అడ్డంకిగా మారాయి. బ్యాంకుల నుంచి అప్పులు చేసైనా సరే రోడ్లను అభివృద్ధి చేయాలని ఆర్‌డిసి పాలకవర్గం భావిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదిక పంపినట్టు తెలిసింది. వాణిజ్య బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని రోడ్ల అభివృద్ధికి అనుమతించడంతోపాటు కౌంటర్ గ్యారంటీ ఇవ్వాలని కోరినట్టు సమాచారం. ఇప్పటికే పాలకవర్గం, అధికారులు బ్యాంకర్లను సంప్రదించారు. ఆర్‌డిసి సంస్థకు అప్పులు ఇవ్వడానికి బ్యాంకర్లు సంసిద్ధత వ్యక్తం చేసినా తిరిగి ఎలా చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ముందడుగు పడటంలేదు. దీంతో అప్పులు ఇచ్చే విషయంలో బ్యాంకర్ల సందేహాలు, ప్రశ్నలకు ఏం సమాధానం చెప్పాలో ఆర్‌డిసికి పాలుపోవడం లేదు.

కేంద్రం సహాయ నిరాకరణ

రాష్ట్రాల అధికారాలు, నిధుల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరితో నూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అప్పులు తీసుకునే అంశంలో ఆర్థిక ఆంక్షలు పెట్టడం ఒకటైతే, జిఎస్‌టి పన్ను నిధులు వెనక్కి పంపడంలో తీవ్ర జాప్యం మూలంగా రాష్ట్రాలకు తీవ్రంగా నష్టం జరుగుతోంది.

ఆర్‌బిఐ అనుమతి

రాష్ట్రంలోని రోడ్ల అభివృద్ధితోపాటు నిర్మాణాల కోసం అప్పులు తీసుకోవడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతి ఇచ్చిందని ఆర్‌డిసి ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఆర్‌డిసి ఇదివరకు తీసుకున్న రుణంతో రాష్ట్రంలోని పలు రోడ్లను అభివృద్ధి చేయడం, రుణం, దాని వడ్డీ చెల్లింపులు కూడా సక్రమంగా చెల్లించిన చరిత్ర ఉండడం తోనే ఆర్‌బిఐ అనుమతి లభించినట్టు ఆర్‌డిసి అధికారులు అంటున్నారు. అయితే, గతంలో ఆర్‌డిసి రుణాలను ప్రభుత్వమే చెల్లించగా, ప్రస్తుతం ఆ విధానంపై రిజర్వు బ్యాంకు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వం చెల్లించకుండా కార్పొరేషనే నేరుగా ఆదాయ వనరులను సమకూర్చుకోవడం ద్వారానే అప్పులు తీర్చాలనే మెలికపెట్టినట్టు తెలిసింది. అప్పు ఇచ్చేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఒక్కటే సరిపోదని, కార్పొరేషన్ నుంచి సొంత ఆదాయం ఏంటో చూపించాలని ప్రపంచ బ్యాంకు తరహా నిబంధనలను పెట్టినట్టు తెలుస్తోంది. దీంతో ఆర్‌డిసికి సొంత ఆదాయం మార్గాలను అన్వేషించేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

గత ఆర్‌డిసి బోర్డు సమావేశంలో కూడా ఇదే విషయం చర్చ చోటుచేసుకున్నట్టు తెలిసింది. అయితే, ఆదాయ మార్గాల అన్వేషించడం, ఆ మేరకు ప్రభుత్వ అనుమతి తీసుకోవడం చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో కాకుండా సొంత నిధులతో చెల్లింపులు చేసేలా కొత్త ఆదాయ మర్గాలను అన్వేషించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు బ్యాంకుల ప్రతిపాదనలు, అభ్యంతరాలను మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్‌డిసి తీసుకున్న లోన్ ఎంత?

ఆర్‌డిసి ఇంతకుముందు రోడ్ల అభివృద్ధికి రెండు విడతలుగా రూ.2600 కోట్ల రుణం తీసుకుంది. వీటికి సంబంధించిన అసలు, వడ్డీ క్రమంగా చెల్లిస్తూ వస్తోంది. అప్పు తీర్చడంలో ఆర్‌డిసి ట్రాక్ రికార్డు బాగుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆర్‌బిఐ నుంచి అనుమతి వచ్చిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ బ్యాంకుల నుంచి మరో రూ.800 కోట్లు రుణం తీసుకోవాలని ఆర్‌డిసి గతంలో జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించింది. బ్యాంకుల నుంచి రుణం ఇస్తే, గ్రామీణ రోడ్లు, రాష్ట్ర రహదారులు ఎన్ని నిర్మించాలన్న అంశాలపై అధికారులు ప్రతిపాదనలతో డిపిఆర్ సిద్ధం చేసుకున్నారని సమాచారం.

ఆదాయ మర్గాలివే ?

ఆర్‌డిసి సొంతంగా ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలని, అందుకు కొన్ని విధానాలు మార్చుకోవాల్సి ఉంటుందని ఆ శాఖ ఉన్నతాధికారుల మధ్య చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఉదాహరణకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో ఆర్‌డిసి సంస్థ పెట్రోల్, డీజీల్ పై వేసే సెస్ నుంచి ప్రతి లీటర్‌కు ఒక రూపాయిని ఆర్‌డిసి ఖాతాలో జమ చేస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాల ఆర్‌డిసిలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయ నేది అధికారుల భావన. దీంతో రహదారుల నిర్మాణం, నిర్వ హణ వాటికి మరింత సులభమవుతుందని మన రాష్ట్ర శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రంలో అలా చేయాలంటే అందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రుణాలు రావాలన్నా, ఆర్‌డిసి ఆర్థికంగా పరిపుష్టిని సాధించాలన్న ఇదే కీలకమైన మార్గమని అభిప్రాయ పడుతున్నారు. అప్పులు తీసుకునే విషయమై త్వరలో సర్కారు నుంచి స్పందన వస్తుందనే ఆశాభావంతో ఆర్‌డిసి అధికారులు ఉన్నారు.

సుంకిశాల ఘటనపై ప్రభుత్వం సీరియస్

- ప్రాజెక్టు డైరెక్టర్ సహా నలుగురు అధికారులపై వేటు
- నిర్మాణ సంస్థ మేఘాకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుంకిశాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సుంకిశాల ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌పై బదిలీ వేటు వేసింది. ఈ ప్రాజెక్టు కన్‌స్ట్రక్షన్ సర్కిల్-3 అధికారులు సిజిఎం కిరణ్, జిఎం మరియరాజ్, డిజిఎం ప్రశాంత్, మేనేజర్ హరీశ్‌ను సస్పెండ్ చేసింది. ఈ మేరకు పురపాలకశాఖ కార్యదర్శి దానకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. జలమండలి ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సుంకిశాల పంపుహౌస్ రక్షణగోడ కూలిపోవడంతో పాటు పంపుహౌస్ పూర్తిగా నీట మునగడంపై అంతర్గత విచారణ జరిగింది. ఆ నివేదికను విచారణ కమిటీ ప్రభుత్వానికి అందజేసింది. దీంతో విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు సంబంధిత అధికారులపై ప్రభుత్వం బుధవారం చర్యలు తీసుకుంది. నిర్మాణ సంస్థకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. హైదరాబాద్‌కు తాగునీరు అందించే సుంకిశాల ప్రాజెక్టు వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్ ఇటీవల నీట మునిగింది. నాగార్జునసాగర్‌కు భారీగా వరద నీరు పోటెత్తడం, ఒక్కసారిగా పంప్‌హౌస్ రెండో సొరంగ మార్గం నుంచి ప్రవాహం ఉధృతంగా రావడంతో టన్నెల్ ముందు భాగంలో నిర్మాణంలో ఉన్న గేటుతోపాటు రక్షణ గోడలోని ఒక ప్యానెల్ కొట్టుకుపోయాయి. దీంతో 83 మీటర్ల లోతులో ఉన్న పంప్‌హౌస్‌లోని సంపు పూర్తిగా నీటితో నిండిపోయింది. ఆ సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. నాగార్జునసాగర్‌లో నీటిమట్టం 510 అడుగులకన్నా తగ్గితే హైదరాబాద్‌కు నీటి తరలింపు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో డెడ్ స్టోరేజీ నుంచి కూడా నీరు తరలించేందుకు వీలుగా నల్గొండ జిల్లా పెద్దవూర మండలం పాల్తితండాలో సుంకిశాల గట్టు వద్ద పంప్‌హౌస్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో జలమండలి శ్రీకారం చుట్టింది. 2021 మార్చి 16న ప్రభుత్వం మేఘా సంస్థకు పనులను కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చింది. తొలుత రూ.1,450 కోట్ల అంచనా వ్యయంతో పనులు కేటాయించగా..అక్టోబరు 2022లో వ్యయాన్ని రూ.2,214 కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. పనులు 70 శాతం పూర్తయ్యాయి. వివిధ లోతుల్లో నీటిని తీసుకునేందుకు వీలుగా పంప్‌హౌస్ నుంచి మూడు సొరంగాలు (టన్నెళ్లు) నిర్మిస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 455 అడుగుల లోతు నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా మొదటి సొరంగాన్ని, 504 అడుగుల లోతు నుంచి తీసుకునేందుకు రెండోది, 547 అడుగుల లోతు నుంచి నీటిని తీసుకునేందుకు వీలుగా మూడోది నిర్మిస్తున్నారు. పంప్‌హౌస్, కృష్ణానదికి మధ్య కేవలం 192 మీటర్లు మాత్రమే దూరం ఉంది. వరద వచ్చిన సమయంలో ఆ ఉధృతి తాకిడి పంప్‌హౌస్‌లోకి చేరకుండా రక్షణ గోడ (రిటెయినింగ్ వాల్) నిర్మించారు. వచ్చే వేసవిలోగా నీరు అందించాలనే ఉద్దేశంతో మధ్య టన్నెల్ పనులు పూర్తిచేసే క్రమంలో సంపువైపు టన్నెల్ ముందు భారీ గేటు ఏర్పాటు చేశారు. రిజర్వాయర్ వైపు ఉన్న మట్టిని తొలగించారు. ఈ ఏడాది ఆగస్టు చివరి నాటికిగానీ మధ్య టన్నెల్ స్థాయి వరకు వరద రాదని భావించారు. 'దానికి భిన్నంగా దాదాపు 3.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో సాగర్ వద్ద అకస్మాత్తుగా ఒత్తిడి పెరిగి ఈ నెల 2న ఉదయం 7 గంటల సమయంలో టన్నెల్‌లోకి భారీ వరద చేరి పంప్‌హౌస్ నీట మునిగింది.

ఫార్మాతో హైదరాబాద్‌కు పెను ప్రమాదం

- అభివృద్ధి పేరుతో కమ్మేస్తున్న కాలుష్యం
- నివారణ చర్యలు చేపట్టాలి
- 'ఒక విధ్వంసం' పుస్తకావిష్కరణ సభలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మా కంపెనీలతో హైదరాబాద్ నగరానికి పెను ప్రమాదం పొంచి ఉందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ చంద్రశేఖర శర్మ రాసిన "ఒక విధ్వంసం 1056/90" పుస్తకావిష్కరణ సభను మంగళవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో మనిషి సృష్టిస్తున్న విధ్వంసం పర్యావరణానికి పెను సవాలుగా మారిందని పేర్కొన్నారు. పటాన్‌చెరు కాలుష్య వ్యతిరేక పోరాట ఘటనలు, సుప్రీంకోర్టు కేసు పరిణామాలను గ్రంథస్థం చేస్తూ తీసుకొచ్చిన ఈ పుస్తకం హైదరాబాద్ భవిష్యత్‌ను ప్రశ్నిస్తున్నదని పేర్కొన్నారు. కాలుష్యం సమస్య పటాన్‌చెరు, ఖాజిపల్లిది మాత్రమే కాదని, మొత్తం నగరాన్ని ఈ భూతం చుట్టి ముట్టిందన్నారు. ఇదే చివరి తరమనే విధంగా మనిషి అన్ని వనరులను తవ్వేస్తూ ప్రకృతిని బొందల గడ్డగా మారుస్తున్నాడని విశ్లేషించారు. జిడిపి, అభివృద్ధి అంటూ ప్రభుత్వాలు వినాశకర విధానాలను ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో మంత్రి కెటిఆర్ లాగే ప్రస్తుత సిఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడుల పేరిట దావోస్, ఇతర యూరప్ దేశాలకు వెళ్లి అదే ఫార్మా కంపెనీలను తీసుకొస్తున్నారని విమర్శించారు. అమెరికా లాంటి దేశాలు ఇలాంటి కంపెనీలకు అనుమతులు ఇవ్వక పోవడంతో అవి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకున్నాయని పేర్కొన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ దేశంలో కాలుష్యం వెదజల్లే ఔషధాలను ఉత్పత్తి చేయకుండా భారత్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ రోగాలను మనకంటగడుతున్నాయని వ్యాఖ్యానించారు. గత మూడు దశాబ్దాలుగా పటాన్‌చెరు ప్రాంత ప్రజలు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నా, నగర ప్రజలు తమకేమీ పట్టనట్టు వ్యవహరించడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా పౌర సమాజం ఈ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించాలని పిలుపు నిచ్చారు. ఆంధ్ర జ్యోతి ఎడిటర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు వచ్చినంత స్పందన పర్యావరణ ఉద్యమాలకు రావడం లేదని అన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా తమదాకా వస్తేగాని నోరుమెదపని అచేతనావస్థలోకి జారి పోయారని వ్యాఖ్యానించారు. ఎవరైనా నిలదిస్తే వారిపై అభివృద్ధి నిరోధకులంటూ ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ విజయ్ మాట్లాడుతూ ఫార్మా, కెమికల్ కంపెనీలు వెదజలుతున్న కాలుష్యం మూసీ ద్వారా మొత్తం నగరాన్ని చుట్టిముట్టిందని అన్నారు. మూసీ కాలుష్యంపై స్వీడిష్ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో భయంకరమైన నిజాలు భయటపడ్డాయని పేర్కొన్నారు. మనుషుల రోగాలకు కారకమయ్యే బ్యాక్టీరియా మూసీ రసాయనాలతో సహవాసం చేసి రోగనిరోధక శక్తిని పెంచుకుందని వెల్లడైందని వివరించారు. దీంతో భవిష్యత్‌లో రోగాలు ఎలాంటి మందులకూ లొంగని పరిస్థితి రావచ్చునిహెచ్చరించారు. పర్యావరణ శాస్త్రవేత్త బాబురావు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బాధితులు ఫిర్యాదుల చేసిన సందర్భంలో నామ మాత్రంగా కేసులు నమోదు చేసి చిన్న పాటి పెనాల్టీలతో సరి పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి కవుల, సుధా తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతే..
దేశ ప్రగతికి దిక్సూచి

- స్త్రీ నిధి 11వ వార్షికోత్సవ సభలో మంత్రి సీతక్క



స్త్రీ నిధి వార్షికోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తేనే దేశ ప్రగతిని సాధించగలుగుతామని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన స్త్రీ నిధి 11వ వార్షికోత్సవ సభలో మంత్రి పాల్గొని మాట్లాడారు. 2011లో మైక్రో, వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పులు తీసుకొని ఎంతోమంది ఆత్మహత్యకు పాల్పడిన సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక భద్రత గురించి ఆలోచించి ఈ స్త్రీ నిధిని స్థాపించినట్టు గుర్తు చేశారు. ప్రతి మహిళా ఆర్థికంగా బలపడితేనే సమాజం బాగుంటుందని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహిళల కోసం ఉచిత బస్సు, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు వంటి అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. శ్రీనిధి పరపతి సహకార సమైఖ్యలో ఇప్పటివరకు 60 లక్షల మంది సభ్యులుగా ఉన్నారని, రాబోయే రోజుల్లో సభ్యత్వం సంఖ్య కోటికి పెంచాలని తెలిపారు. గత మార్చి నెలలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో స్త్రీ నిధి సభ్యులకు రూ.10 లక్షల ప్రమాద బీమా, లోన్ బీమా ఏర్పాటుపై చర్చలు జరిగాయని, త్వరలోనే అవి అమలు అవుతాయని అన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని కోరారు. మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికడతామని అన్నారు. మహిళలకు ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత కూడా అత్యంత అవసరమని తెలిపారు. మహిళల కోసం మహిళా శక్తి క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలతో పాటు 17 రకాల వ్యాపారాలను రూపొందించామని అన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి కార్యదర్శి లోకేష్ కుమార్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య, శ్రీనిధి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇందిరా, కోశాధికారి సరస్వతి, మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక కళా యాత్ర

- 21న ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి సెప్టెంబర్ 21 వరకు హైదరాబాద్‌లో 'డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొలుపుదాం' పేరిట కళాయాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలోని కళాభవన్‌లో పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ కళా యాత్రలో 20 మంది కళాకారులు.. హైస్కూల్, కళాశాలలు, బస్తీలు, కాలనీల్లో నృత్యాలు, నాటికలు ఇతర కళా రూపాలతో ప్రదర్శనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. గోడ పత్రిక ఆవిష్కరణలో ఆహ్వాన సంఘం సలహాదారు డిజి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి ఎం మారన్న, పిఎన్ఎం నాయకులు పి మల్లేష్, జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ బుధవారం తెలిపారు. కె కేశవరావు రాజీనామాతో తెలంగాణలో రాజ్యసభ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. రాజ్యసభలోని 12 స్థానాల్లో ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది. తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాలకు చెందిన ఈ ఖాళీలకు సంబంధించి సెప్టెంబరు 3న ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం (ఇసి) ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది.

గిరిజన శాఖకు మంత్రిని కేటాయించండి

- సిఎం వద్ద ఉంటే సామాన్యులు కలిసేదెలా...
- చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించాలి
- లేదంటే ప్రత్యక్ష పోరాటాలు చేపడతాం
- తెలంగాణ గిరిజన సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు



అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉంటే సామాన్యులు ఆయన్ను ఎలా కలవాలని పలువురు నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన శాఖకు మంత్రి కేటాయించకపోవడం సామాజిక వివక్ష చూపడమేనని విమర్శించారు. తక్షణమే ఆ శాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అందుకోసం ప్రభుత్వం తగిన కార్యాచరణను ప్రకటించాలని సూచించారు. లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు పూనుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అనేక హామీలివ్వడం ద్వారా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. తొమ్మిది నెలలైనా గిరిజన శాఖకు మంత్రిని కేటాయించలేదని చెప్పారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ నుంచి ఎస్‌టి కమిషన్‌ను వేరు చేసి చైర్మెన్‌ను నియమించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద గిరిజన శాఖ ఉండడంతో సమస్యలను చెప్పేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద గిరిజనులకు రూ.12 లక్షల ఆర్థిక సాయం చేయాలని కోరారు. మంత్రిని కేటాయించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ఉంటే ప్రత్యక్ష పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్, బిఆర్ఎస్ గిరిజన విభాగం సీనియర్ నాయకులు రూప్ సింగ్, సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు, ఎల్‌హెచ్‌పిఎస్ నాయకులు రాజేష్ నాయక్, గుగులోత్ భీమా నాయక్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకులు కురాకుల శ్రీనివాస్, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం ఉపాధ్యక్షులు పాతపల్లి నరసింహ, ప్రొఫెసర్ బాలా నాయక్, తెలంగాణ గిరిజన జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, డాక్టర్ జి శంకర్, సోమలాల్ జాదవ్, సేవాలాల్ సేన నాయకులు రఘురాం రాథోడ్, మధు నాయక్ సేవాలాల్ సేన టివి మోహన్, గిరిజన సంస్కృతి ఎడిటర్ ఆర్ ధర్మానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. చేవెళ్ల ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్, మ్యానిఫెస్టోలో 16 రకాల వాగ్దానాలను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారని చెప్పారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని అన్నారు. అయితే కాంగ్రెస్ నేతలు మాత్రం ప్రజా ప్రభుత్వంలో గిరిజనులకు భాగస్వామ్యం లేకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లా వైరాకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నారనీ, గిరిజన శాఖ మంత్రిని నియమిస్తామంటూ ఈ సందర్భంగా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించాలని కోరారు. లేదంటే రాష్ట్రంలోని అన్ని గిరిజన, ఆదివాసీ సంఘాలతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేసి ప్రత్యక్ష పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆ సంఘం నాయకులు ఎం బాలు, రఘు, గోపి, రామ్ కుమార్, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం త్యాగం చేసిన చరిత్ర బిజెపికి ఉందా?


- అమరజ్యోతి యాత్ర స్వాగత కార్యక్రమంలో జగ్గారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనడంగాని, దేశం కోసం త్యాగం చేసిన చరిత్రగానీ బిజెపికుందా? అని పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి ప్రశ్నించారు. రాజీవ్‌గాంధీ దేశ ప్రజల కోసం బలిదానమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులోని పెరంబుదూర్ నుంచి వచ్చిన 'రాజీవ్‌గాంధీ అమరజ్యోతి యాత్ర'కు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఉపయోగిస్తున్న టెక్నాలజీ కూడా రాజీవ్‌గాంధీ దూరదృష్టితో తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ గురించి దేశ ప్రజలకు తెలిసేలా దొరై ఆధ్వర్యంలో పెరంబుదూర్ నుంచి ఢిల్లీ వరకు అమర జ్యోతి యాత్ర నిర్వహిస్తున్నారని తెలిపారు. మాజీ ఎంపి వి హనుమంతరావు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ ఇండియాను ప్రపంచ దేశాల్లో ఒకటిగా నిలబెట్టాలనుకున్నారని గుర్తు చేశారు. 18 ఏళ్ల నిండిన వారికి ఆయన ఓటు హక్కును కల్పించారని తెలిపారు. రాజీవ్‌గాంధీ అడుగు జాడల్లో నడుస్తూ రాహుల్‌గాంధీ కులగణనకు తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ఒబిసి అని చెబుతారని, కానీ వెనకబడిన వర్గాలకు ఆయన ఎప్పుడూ ఏమీ చేయలేదని విమర్శించారు. రాజీవ్ అమర జ్యోతి ఆర్గనైజర్ దొరై మాట్లాడుతూ సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే కెసిఆర్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం ముందుకు సాగుతుందని చెప్పారు. ఈ నెల 20న రాజీవ్‌గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఢిల్లీలో సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీ, మల్లికార్జున ఖర్గేకు అమరజ్యోతిని అందజేస్తామని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- ఉద్యోగులను తెలంగాణకు తెచ్చిన సిఎంకు కృతజ్ఞతలు
- టిఎన్‌జిఒ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, ముజీబ్
- హైదరాబాద్‌లో ముగిసిన ఎఐఎస్‌జిఇఎఫ్ సమావేశాలు



అభివాదం తెలుపుతున్న టిఎన్‌జిఒ సభ్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని టిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ డిమాండ్ చేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న 122 మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకొచ్చిన రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఎఐఎస్‌జిఇఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం ముగిశాయి. ఆ సంఘం అధ్యక్షులు సుభాష్ లాంబ, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీకుమార్‌తోపాటు 24 రాష్ట్రాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలని కోరారు. ఐదేండ్లకు ఒకసారి వేతన సవరణ జరగాలని సూచించారు. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య సదుపాయాన్ని కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.పది లక్షలకు పెంచాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలని కోరారు. గ్రంథాలయం, మార్కెటింగ్ కమిటీ, ఎయిడెడ్ సంస్థల ఉద్యోగులకు 010 పద్దు ద్వారా వేతనాలను చెల్లించాలని చెప్పారు. నూతన జిల్లాలకు అదనపు క్యాడర్ స్ట్రెంత్‌ను మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, పి హరి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి విక్రమ్, నాయకులు కురాడి శ్రీను, శంకర్, ఆదిలాబాద్ అధ్యక్షులు అశోక్, సంగారెడ్డి అధ్యక్షులు జావిద్అలీ, నిజామాబాద్, నాగర్‌కర్నూల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్ అధ్యక్ష, కార్యదర్శులు కిషన్, శేఖర్, వెంకటేశ్, లక్ష్మణ్, శ్రీహరి, రామ్మోహన్, రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.